ఒకటవ భాగం

# నాన్నా చెప్పవా ?! (ఇగ్నైట్ కార్నర్)

మోహన్ 6 సంవత్సరాల వయసు గల అబ్బాయి. వాళ్ళ నాన్నతో ముచ్చట్లు చేయడం పరిపాటి. విచిత్రమైన సందేహాల పుట్ట. ఆ విశేషాలేమిటో తెలుసుకుందామా !

మోహన్ : డాడీ , ఐస్ కొనుక్కుందామా !

నాన్న : అలాగే నాన్నా. బండి వచ్చినపుడు కొనుక్కుందాం.

(కొద్ది సేపటికి ఐస్ బండి గంట వినబడుతుంది.)

నాన్న : నాన్నా ! ఐస్ ... ఐస్ ...

మోహన్ : ఎందుకు డాడీ, అలా అరుస్తావు. ఎవరైనా వింటే నువ్వు ఐస్ అమ్ముతున్నావని పొరపాటు పడతారు.

నాన్న : పద. ఐస్ కొనుక్కుందాం.

(రెండు పుల్ల ఐస్ లు కొనుక్కుని ఇంట్లోకి వస్తారు.)

మోహన్ : అమ్మా! డాడీ, నీ కోసం ఐస్ కొన్నాడు. తింటావా ? (నవ్వుతూ అడుగుతాడు. అమ్మ వద్దంటుంది.)

మోహన్ : డాడీ, నాకు చాలా సంతోషంగా ఉంది. అమ్మ తన ఐస్ కూడా నన్నే తినమంది.

నాన్న : సరే. తిందువు గానీ అమ్మ ఫ్రిజ్ సర్దుతూ ఉంది. వెళ్ళి చూడు ఎలా సర్దుతుందో.

మోహన్ : అలాగే డాడీ.

(కొద్ది సేపటికి ఒక ఐస్ తినడం అయిపోయింది. ఫ్రిజ్ లో గడ్డలుగా కట్టిన ఐస్ ముక్కలను గిన్నెలో పెట్టుకుని వచ్చాడు.)

నాన్న : నాన్నా! నువ్వు తినే ఐస్ రంగులో ఉంది కదా, మరి ఫ్రిజ్ లో ఐస్ ఎందుకు తెల్లగా ఉంది.

మోహన్ : డాడీ , కామెడీ చేస్తున్నావా నువ్వు. మనం ఫ్రిజ్ లో రంగు వేయలేదు కదా. అది కూడా తెలీదా ? నీకు.

మోహన్ : డాడీ , ఐస్ పట్టుకుంటే చల్లగా ఉంటుంది. కదా.

నాన్న : అవును నాన్నా, ఐస్ పట్టుకున్నపుడు మన శరీరంలో వేడి ఐస్ కు ప్రసారం అవుతుంది. అంటే మన శరీరం నుండి వేడి బయటకు వెళుతుంది. అందుకని మనకు చల్లగా ఉంటుంది.

మోహన్ : డాడీ మళ్ళీ కామెడీగా మాట్లాడుతున్నావు. ఐస్ పట్టుకుంటే మనకు చల్లదనం వస్తుంది గానీ, వేడి పోతుందంటావేమిటి!

నాన్న : నువ్వన్నదీ ఒక రకంగా నిజమే.

మోహన్ : డాడీ ! పుల్ల ఐస్ ఇంకా గట్టిగా ఉంది. కానీ ఫ్రిజ్ లో నుండి తీసిన ఐస్ త్వరగా కరిగిపోతుంది. కదా.

నాన్న : ఫ్రిజ్ లో నుండి తీసిన ఐస్ కేవలం నీళ్ళ వల్ల ఏర్పడుతుంది. ఐస్ చేసేటపుడు నీటిలో కాస్త ఉప్పు వేస్తే గట్టిగా అవుతుంది. ఎక్కువ చల్లగా ఉంటుంది. రుచిగా కూడా ఉంటుంది.

ignitephysics.weebly.com

మోహన్ : డాడీ ! ఐస్ ముక్కలు గిన్నెలోని నీళ్ళలో తేలుతున్నాయి. భలేగా ఉన్నాయి. చేపల్లాగా ఉన్నాయి డాడీ.

నాన్న : అవును నాన్నా, ఐస్ తేలుతుంది.

మోహన్ : ఎందుకు తేలాలి. మునగొచ్చు కదా. బాగుంటుంది. చేపలాగా మునిగితే.

నాన్న : ఐస్ ముక్కలకు సాంద్రత ధర్మం నీటి కంటే తక్కువగా ఉంటుంది. అందుకని నీటిలో తేలుతాయి. మునగవు.

మోహన్ : అయితే, మనం కూడా నీటిలో తేలిపోదాం డాడీ. భలే సరదాగా ఉంటుంది.

నాన్న : మనం నీళ్ళలో తేలలేము. మునిగిపోతాము. మన సాంద్రత ఎక్కువ కదా. అయితే సాంద్రత ఎక్కువ ఉన్న డెడ్ సీ లో తేలతాము.

మోహన్ : నువ్వు తేలావా, డాడీ ఎపుడన్నా !

నాన్న : లేదు నాన్నా.

మోహన్ : మరి తేలుతామని చెప్పావుగా.

నాన్న : అవును. అందులో తేలుతామట. మనం నీళ్ళలో రాయి వేస్తే ఏమవుతుంది ?

మోహన్ : మునుగుతుంది

నాన్న : నీళ్ళలో ప్లాస్టిక్ చెంబు వేస్తే ఏమవుతుంది ?

మోహన్ : (ఆలోచించి) తేలుతుంది

నాన్న : అంటే నీళ్ళలో కొన్ని వస్తువులు మునుగుతాయి. కొన్ని వస్తువులు తేలుతాయి. అలాగే డెడ్ సీ లో కూడా మనుషులు తేలుతారట నాన్నా.

మోహన్ : ఇంక చెప్పింది చాలు గానీ, టి.వి. పెట్టుకుంటాను డాడీ. షిన్ చాన్ వస్తుంది. చూడాలి.

నాన్న : సరే నాన్నా.

NAGA MURTHY- 9441786635
Contact at : nagamurthysir@gmail.com
Visit at : ignitephysics.weebly.com